దాతల సేవలు అభినందనీయం



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ నిర్వాహకులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: నియోజకవర్గ అభివృద్ధిలో దాతలు భాగస్వాములవ్వడం అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో మంగళవారం భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో సీఎస్ఆర్ ఫండ్ రూ.15.35 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను, పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాంమోహన్, డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ధనులతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ఏదో ఒక రూపంలో సేవ చేయాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే పెద్దలు, వృద్ధులు, పిల్లలకు ఓపెన్‌జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మరిన్ని కాలనీల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



బాగ్‌అమీర్‌లోని జీవీ హైట్స్ విశాల్ టవర్స్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

◆ వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్‌అమీర్‌లో జీవీ హైట్స్ విశాల్ టవర్స్‌లోని పార్కులో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ వారు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండీ రాంమోహన్‌రావు, డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ధనులతతో కలిసి ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలని ప్రజాప్రతినిధులు కోరారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కార్పొరేటర్‌లతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి



నియోజకవర్గ సమస్యలపై కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. మంగళవారం కార్పొరేటర్‌లతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి సమస్యలపై చర్చించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, జేఎన్‌టీయూ చౌరస్తా వద్ద సత్వరం ప్రాజెక్టు విభాగం ఆధ్వర్యంలో అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని కోరారు. వసంత్‌నగర్ నుంచి గోకుల్‌ప్లాట్ మీదుగా హైటెక్ సిటీకి వెళ్లే దారిలో, మూసాపేట, ఆంజనేయనగర్ నుంచి కైత్లాపూర్ వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. గత ప్రభుత్వంలో ఆమోదం తెలిపి మిగిలి ఉన్న పనులను ప్రాధాన్యత ప్రకారం ముందుగా చేపట్టాలని కోరారు. విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సనత్‌నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ పనులు త్వరగా మొదలు పెట్టాలని కోరారు. అదేవిధంగా బాలానగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు చేపట్టాలన్నారు. బాలాజీనగర్ డివిజన్‌లో అనేక చోట్ల మురుగునీటి కాలువ నిర్మాణ పనులు మొదలు పెట్టి పెడింగ్‌లో పెట్టారని, వాటిని పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. పేదల బస్తీలో ఇంటి నెంబర్ల కేటాయింపు చేయాలన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం అందజేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. మూసాపేట మెయిన్ రోడ్డు నుంచి సర్కిల్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు సగం పూర్తి చేశారని, మిగతా సగం పెండింగ్‌లో ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. డివిజన్‌ల వారీగా కార్పొరేటర్‌లతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్లకు డిసెంబర్ వరకు చెల్లింపులు పూర్తయ్యాయని, డివిజన్‌లలో జరిగే పనుల నాణ్యత విషయమై కార్పొరేటర్‌లు దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, సబిహాబేగం, మహేశ్వరి శ్రీహరి, శిరీష పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు



సీపీఐ నాయకులతో కలిసి దివ్యాంగుడికి బస్‌పాస్‌ను అందజేస్తున్న డిపో మేనేజర్ హరి

మూసాపేట: దివ్యాంగులకు ప్రశాంత్‌నగర్ వద్ద మంగళవారం బస్‌పాస్ కౌంటర్‌ను డీఎం హరి ప్రారంభించారు. ప్రశాంత్‌నగర్ వద్ద బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు ఇటీవలే వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారులను సంప్రదించి.. వారి ఆదేశాల మేరకు దివ్యాంగుల బస్‌పాస్ కౌంటర్‌ను ప్రారంభించారు. సీపీఐ నాయకులతో కలిసి దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ, యూనిట్ సెక్రటరీ ఇక్బాల్, నాయకులు మోనో చారి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్మికులకు వైద్య శిబిరం

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని రాజు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఎన్ఐఎన్ అధికారులు పోషకాహారం, హైజీన్‌పై అవగాహన కల్పించారు. ఉదయం 12 గంటలకు ఈఎస్ఐ వారిచే కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ మంది కార్మికులు మహిళలు ఉండటంతో గైనకాలజిస్టు వైద్యుల సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ కృష్ణయ్య, రమేష్ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ ఉదయ్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకున్న కార్మికులు

కబ్జాదారులను నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి

మియాపూర్: మియాపూర్‌లోని సర్వేనంబర్ 100, 101, 44 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..100, 101, 44 సర్వేనంబర్‌లో భూమి వందల ఎకరాల్లో ఉందని, ఈ భూమి వివాదంలో ఉందన్నారు. సుప్రీంకోర్టులో ఈ భూమిపై విచారణ జరుగుతుంది. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు స్టేటస్‌కో విధించింది. అయినా ఈ సర్వేనంబర్‌లోని భూములను పక్కన గల సర్వేనంబర్‌లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి తహసీల్దార్లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అదేవిధంగా మియాపూర్ బస్ డిపో వెనుకాల రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు కబ్జాచేసి రూములు, ప్రహరీల నిర్మాణాలు చేపట్టారని వాటిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన గాంధీ

గచ్చిబౌలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తం రెడ్డి మరణించిన నేపథ్యంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరామర్శించారు. మంగళవారం మసీద్‌బండలోని సైబర్ మిడోస్‌లో పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల జోలికొస్తే ఊరుకోం

- ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకు అండగా ఉంటా
- పది సంవత్సరాల కాలంలో చెరువులు కబ్జాకు గరికాలేదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బస్తీ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: పేద ప్రజల జోలికి 'హైడ్రా' వస్తే సహించేది లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు, అధికారులతో కలిసి హస్మత్‌పేట బోయిన్ చెరువు వద్ద అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.5 కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో ఉన్న 7 చెరువులు, రెండు కుంటలు ఎక్కడ కూడా కబ్జాకు గురికాలేదన్నారు. కోట్ల నిధులతో చెరువులను సుందరంగా తీర్చిదిద్దేందుకు తగిన కృషి చేశామన్నారు. హస్మత్‌పేట బోయిన్ చెరువును ఇప్పటికే 25 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామని తెలిపారు. చెరువు పక్కనే వంద ఏళ్ల నాటి క్రితం ఎస్సీ బస్తీ ఏర్పడిందని గుర్తు చేశారు. బోయిన్ చెరువు 73 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నదని, అందులో కంటోన్మెంట్ వైపు 13 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. చెరువు ఎక్కడెక్కడ కబ్జాకు గురైందో, ఎవరు చేశారో? స్పష్టంగా చెప్పాలని అధికారులను ఆదేశించారు.



చెరువు కట్టపై పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రజలు తిరగబడితే బంగ్లాదేశ్ ప్రధాని గతే రేవంత్‌రెడ్డికి..

హైడ్రా పేరుతో పేద ప్రజల ఇండ్లను కూల్చవద్దని, ప్రజలు తిరగబడితే బంగ్లాదేశ్ ప్రధానికి పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి తప్పదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. అభివృద్ధి పనుల పరిశీలన సందర్భంగా హరిజన బస్తీకి చెందిన పేద ప్రజలు తమ నివాసాలను కూల్చివేస్తారన్న ఆందోళన వ్యక్తం చేశారు. వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకు అండగా ఉంటానన్నారు. న్యాయస్థానాల ఆదేశాలను హైడ్రా పాటించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్, వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో పాటు నాయకులు నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్ రావు, కర్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, నర్సింగ్‌రావు, యాదగిరి, పోచయ్య, పిట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలానగర్‌లో బతుకమ్మ వేడుకలు

బాలానగర్: తెలంగాణ పూల పండుగ బతుకమ్మ వేడుకలను బుధవారం సాయంత్రం 5 గంటలకు బాలానగర్ దుర్గామాత గుడికి ఎదురుగా ఉన్న రోడ్డు వద్ద నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరు కానున్నారని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

కూకట్‌పల్లి: దసరా సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. కూకట్‌పల్లి రామాలయం అనుబంధ దేవాలయం చిత్తారమ్మ తల్లి ఆలయంలో జరిగే నవరాత్రుల ఉత్సవాలకు హాజరు కావాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ దంపతులకు వేద పండితులు మంగళవారం ఆహ్వానాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప స్వాములకు అన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ, జేఎన్‌టీయూ రోడ్డులోని పోచమ్మ తల్లి ఆలయం వద్ద ధర్మశాస్త భక్త సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నేటి నుంచి 10 జనవరి 2025 వరకు అన్న సమారాధన నిర్వహించనున్నారు. వ్యవస్థాపకులు వూచా రాంబాబు గురుస్వామి, బీఎస్ఎస్ రాజు స్వామి, నూతి వాసు నాయుడు, నూతి రాంబాబు గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదానం కార్యక్రమం 8 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వాములు ప్రతి రోజు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మోతీనగర్‌లో వయో వృద్ధుల దినోత్సవం



వయో వృద్ధులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ డాక్టర్ ప్రసాద్ తదితరులు

మోతీనగర్: నేడు చాలా మంది కుటుంబాల్లో వృద్ధులను ఆశ్రమాల్లో చేర్పింటం ద్వారా ఉమ్మడి కుటుంబాలు కనబడటం లేదని మోతీనగర్ సీనియర్ సిటిజన్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో పలువురు వయో వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులతో పాటు కుటుంబంలో ఉన్న వయో వృద్ధుల యోగ క్షేమాలను కూడా తెలుసుకోవాలన్నారు. వారికి అవసరమైన కనీస వసతులను కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్.అంజిరెడ్డి, బి. నాగేశ్వరరావు, బి.సీతారామయ్య, శేషగిరిరావు, ముక్తేశ్వరరావు, సుబ్బరామయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో దసరా ఉత్సవాలు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



మౌంట్ లిటేరా కిడ్జి పాఠశాలలో..

ఆల్విన్‌కాలనీ: న్యూఎరా పాఠశాలలో మంగళవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పదవ తరగతి విద్యార్థినులు చేసిన నవ దుర్గమ్మల నృత్యం, మహిషాసుర మర్దన నృత్యం చూసిన ప్రతి ఒక్కరి మనస్సు పులకరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, ఎకాడమిక్ ఇన్‌చార్జి అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌంట్ లిటేరా కిడ్జి పాఠశాలలో..

మూసాపేట: మూసాపేటలోని మౌంట్ లిటేరా కిడ్జి పాఠశాలలో మంగళవారం బతుకమ్మ, దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను పేర్చి ఆడారు. దసరా, బతుకమ్మ ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ శ్రావణి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణవేణి హైస్కూల్‌లో బతుకమ్మ..

ఓల్డ్‌బోయిన్‌పల్లి: హస్మత్‌పేట్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌లో కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దీపికారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ వేడుకలో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల అనంతరం బియ్యం, నువ్వులు, బెల్లం, పెసర్లతో చేసిన ప్రసాదాలను పంచిపెట్టారు.



శరన్నవరాత్రోత్సవాలకు సిద్ధం

- బతుకమ్మ, దేవీ నవరాత్రుల ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- విద్యుత్‌దీపాలతో మండపాల అలంకరణ



రేపటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో దేవీ నవరాత్రులు, బతుకమ్మ సంబురాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అంతేగాకుండా పలుచోట్ల మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారి నవరాత్రులను ఘనంగా నిర్వహించనున్నారు. బుధవారం నుంచి బతుకమ్మ సంబురాలు కూడా ప్రారంభం అవుతుండటంతో బంతిపూలకు రెక్కలు వచ్చాయి. గునుగు, తంగేడు వంటి పూలను హైదరాబాద్ నగరం చుట్టుపక్కల ఉన్న జిల్లాల నుంచి తీసుకువచ్చి ఆయా మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. మూసాపేట వార్డు కార్యాలయం సమీపంలోని రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో దేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సప్పిడి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 3వ తేదిన వనబాలాదేవిగా, 4న లక్ష్మీదేవిగా, 5న వైష్ణవి దేవిగా, 6న గౌరీ దేవిగా, 7న అన్నపూర్ణాదేవిగా, 8న రాజరాజేశ్వరిగా, 9న సరస్వతీ దేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్దని దేవిగా, 12న శాంతాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 7 గంటలకు సామూహిక కుంకుమ పూజలు ఉంటాయని ఆయన తెలిపారు.

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ, రోడ్డు నెం. 2, ధనలక్ష్మి సెంటర్‌లో కనకదుర్గ, సరస్వతీ దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాలను ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. శ్రీదేవి అమ్మవారిని గురువారం శ్రీ స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవిగా, శుక్రవారం బాలత్రిపురా సుందరి దేవిగా, శనివారం గాయత్రిదేవిగా, ఆదివారం లలితా త్రిపురాసుందరి దేవిగా, సోమవారం అన్నపూర్ణ దేవిగా, మంగళవారం మహాలక్ష్మి దేవిగా, బుధవారం సరస్వతీ దేవిగా, గురువారం దుర్గాదేవిగా, శుక్రవారం మహిషాసురమర్దినిగా, శనివారం రాజేశ్వరి దేవిగా అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయంలో ప్రతి రోజు బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

శారదా శంకరమఠంలో..

మోతీనగర్: మోతీనగర్‌లోని శారదా శంకరమఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 12వ తేది వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు మోతీనగర్ శంకరమఠం పరిపాలన అధికారి సీఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం బ్రాహ్మి అవతారంగా, శుక్రవారం మహేశ్వరిదేవిగా, శనివారం కౌమారిగా, ఆదివారం వైష్ణవిగా, సోమవారం ఇంద్రాణిగా, మంగళవారం గజలక్ష్మిగా, బుధవారం సరస్వతి దేవిగా, గురువారం దుర్గాదేవిగా, శుక్రవారం రాజరాజేశ్వరిగా, శనివారం కామధేను అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. నవరాత్రుల్లో ప్రతి రోజు ఉదయం 6 నుంచి చండీసప్తశతి పారాయణ, సవాక్షరి జపం, నిత్యార్చన, గోపూజ మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి, సాయంత్రం 6 గంటలకు శారదాంబ రథసేవ ఉంటాయని తెలిపారు. అదే విధంగా కబీర్ నగర్‌లోని శివరామాంజనేయ స్వామి ఆలయంలో, పాండురంగ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి తదితర దేవాలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

ఎంఈఓను సన్మానించిన ట్రస్మా సభ్యులు



కూకట్‌పల్లి: ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌ను తన కార్యాలయంలో ట్రస్మా సభ్యులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్యను అందించాలన్నారు. విద్యార్థులను లక్ష్యం వైపు నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రామకృష్ణారావు, ఉపాధ్యక్షుడు పంచశీల శ్రీనివాస్, కూకట్‌పల్లి ప్రెసిడెంట్ కమలాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవిబాబు, సభ్యులు సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, రవీందర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, శంకర్, ప్రభాకర్ రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం



కార్యక్రమంలో సీడీపీఓ రేణుక, అంగన్‌వాడీ సిబ్బంది

మోతీనగర్: అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పర్వత్‌నగర్ సెక్టార్‌లో గ్రాండ్ పేరెంట్స్‌డే, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీఓ రేణుక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్నో రకాల సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పోషక ఆహార జాగ్రత్తలను సూపర్‌వైజర్ అనిత వివరించారు. 5 సంవత్సరాల పిల్లలకు బాలామృతం అందించే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కూకట్‌పల్లి: రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కేపీహెచ్‌బీలోని టెంపుల్ బస్టాప్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, మహిళా నేతలు మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖకు ఎంపీ రఘునందన్‌రావు మెడలో దండ వేశారని, కల్యాణలక్ష్మి డబ్బులు ఇచ్చారా? అని ఎగతాళి చేయడం సరి కాదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫణీంద్ర, రేష్మ, ప్రవీణ్‌కుమార్, మేకల మైఖేల్, లక్ష్మీనారాయణ, రాజు, సంధ్య, పొన్నం రజిత, జోజమ్మ, మారుతి, యమున, సుందరి, విజయలక్ష్మి, మమత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

కూకట్‌పల్లి: గాంధీ జయంతిని పురస్కరించుకొని చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. 'గాంధీజీ మార్గం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహులు, ఫౌండేషన్ కార్యదర్శి అప్పాజి శ్రీనివాస్, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు స్మితా, మధుసూదన్, సువర్ణ, స్వప్న, సాబేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ దండోరా నేతలపై దాడి

కూకట్‌పల్లి: బాలానగర్ ఇంద్రానగర్‌లోని కబ్జాకు గురైన దళిత, బహుజనుల శ్మశాన వాటికను మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్‌మాదిగ మంగళవారం పరిశీలించారు. ఈ క్రమంలో వారు వచ్చిన వెంటనే కొంతమంది దుండగులు అడ్డుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నవీన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్యకేసులో ఇద్దరిపై అనుమానం

పోలీసుల అదుపులో అనుమానితులు

మియాపూర్: దీప్తీశ్రీనగర్, సీబీఆర్ ఎస్టేట్‌లో సోమవారం జరిగిన వివాహిత హత్య కేసులో ఇద్దరు అనుమానితులను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్‌లోని 110 రూమ్‌లో ఉంటున్న స్పందన(29)ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తి, రాడుతో తల, ముఖంపై విచక్షణరహితంగా దాడి చేయగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంపై తల్లి నమ్రత పోలీసులు ఫిర్యాదు మేరకు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సదరు వ్యక్తి మృతురాలి స్పందనకు ఇంటర్మీడియేట్ నుంచి క్లాస్‌మెట్ అని తెలుస్తుంది. దీంతో సదరు వ్యక్తితో పాటు మృతురాలి భర్తను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.